సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అందుబాటులోకి క్రీడా మైదానాలు



క్రీడా మైదానాలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని బ్యాంక్ కాలనీ వద్దనున్న బ్లూమింగ్ స్టార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల యాజమాన్యం ఆధునిక క్రీడామైదానాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాటిని జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌చంద్ర, కార్యదర్శి లక్ష్మణ్ సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యార్థులే కాకుండా, ఇతర విద్యార్థులు కూడా ఇక్కడికి వచ్చి శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు. పాఠశాల డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ ఇక్కడ క్రికెట్, స్కేటింగ్, వాలీబాల్, టెన్నిస్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, పికెల్ బాల్ మొదలైన వాటికి సంబంధించి ప్రత్యేక మైదానాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు ఇటువంటి శిక్షణకు విశాఖ వరకు వెళ్లవలసి వచ్చేదన్నారు. ఆసక్తి గలవారు శిక్షణ పొందవచ్చని తెలియజేశారు.

బీజేపీకి 'కాదా' రాజీనామా



సూర్యనారాయణ

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట సర్పంచ్ కాదా సూర్యనారాయణ బీజేపీకి రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థిగా ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన ఇటీవల వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పరిస్థితుల కారణంగా ఇటీవల బీజేపీలోకి వెళ్లానని, ప్రస్తుతం ఆ పార్టీని వీడానని తెలిపారు.

గణనాథుడి సన్నిధిలో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

మధురవాడ: చంద్రంపాలెంలో శ్రీ శివనందన ప్రియ గణనాథుడిగా కొలువుదీరిన 41 అడుగుల భారీ మట్టి వినాయకుడి సన్నిధిలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. మండపంలో ఏర్పాటు చేసిన శివలింగం వద్ద కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఈ కార్యక్రమం జరిపించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మిథిలాపురి వుడా కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ: జీవీఎంసీ ఏడో వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని పలు చోట్ల రూ. 1.44కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. వాంబేకాలనీలో రూ. 19.80 లక్షలతో కాల్వలు, సీసీ కల్వర్టులు, పాత పీఎం పాలెం మోర్ సూపర్ మార్కెట్ వద్ద రూ.19.70లక్షలతో సీసీ రోడ్డు, సీసీ కాలువ నిర్మాణం, ఎన్‌జీజీవోస్ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీల్లో రూ. 39.35లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం, ఆర్‌టీసీ డిపో, మొగదారమ్మ గుడి వద్ద రూ. 32.65లక్షలతో ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణ పనులకు ఆయన శిలాఫలకం ఆవిష్కరించారు. ముందుగా పిలకవానిపాలెంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, డీఈ మణికుమార్, ఏసీ శ్రీనివాస్, కార్పొరేటర్లు పిల్లా మంగమ్మ, ఎల్. అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళులర్పిద్దాం

తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకుని మహానేతకు ఘన నివాళులర్పిద్దామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను పిలుపునిచ్చారు. భీమిలి మండలం టి.నగరపాలెం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నందున నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కార్పొరేట్ కాలుష్యం

- 'తాళ్లవలస'ను ముంచెత్తుతున్న విద్యాసంస్థల వ్యర్థాలు
- ముందుగా చెరువు గర్భాన్ని ఆక్రమించి నిర్మాణాలు
- ఆపై శుద్ధి చేయకుండానే చెరువులోకి విడిచిపెడుతున్న మురుగు
- అనారోగ్యం బారిన సమీప గ్రామ ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చెరువు గర్భంలో రక్షిత మంచినీటి పథకం

తగరపువలస: భీమిలి మండలం జాతీయరహదారికి ఇరువైపులా విస్తరించిన ఉన్న తాళ్లవలస పంచాయతీని కాలుష్యం కుదిపేస్తోంది. గత పదేళ్ల కాలంలో తాళ్లవలస పంచాయతీతో పాటు పక్కనే ఆనుకుని ఉన్న ఆనందపురం మండలం పెద్దిపాలెం పంచాయతీతో కలిపి 7 వరకు కార్పొరేట్ విద్యాసంస్థలను నెలకొల్పారు. ఈ విద్యాసంస్థలు నిర్మాణ సమయంలో ప్రకృతిసిద్ధమైన గెడ్డలను కబ్జా చేయడమే కాకుండా వినియోగించిన మురుగునీటి వ్యర్థాలను శుద్ధి చేయకుండా నేరుగా చెరువులోకి మళ్లిస్తుండటంతో చెరువు చుట్టూ నివాసం ఉంటున్న ఆయా గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

చెరువు గర్భంలోనే ట్యాంకులు, బోర్లు

ఈ చెరువు గర్భంలోనే తాళ్లవలస, పెద్దిపాలెం గ్రామ పంచాయతీలకు చెందిన రక్షిత మంచినీటి పథకాలు, వాటిని ప్రధాన వనరులు అయిన బోరుబావులు, తాళ్లవలస పంచాయతీలోని రెడ్డి, ఎస్సీ, క్షత్రియ సామాజిక వర్గాలకు చెందిన శ్మశానవాటికలు, వాటికి సంబంధించిన బోరుబావులు ఉన్నాయి. చెరువు గట్టుపై ఇరువైపులా గ్రామదేవత బంగారమ్మ ఆలయాలు, చెరువును ఆనుకుని రాజుల తాళ్లవలస, బంగారమ్మ కాలనీ, ఎరుసుపేట, గొల్లల తాళ్లవలస, యాతపేట గ్రామాలు ఉన్నాయి.

విద్యాసంస్థలకు కాసులు.. పంచాయతీ ప్రజలకు రోగాలు

చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లుగా ఈ విద్యాసంస్థలు కాసులు సంపాదిస్తూ పంచాయతీ ప్రజలకు రోగాలు మిగులుస్తున్నారు. ఇటీవల చిన్నిపేట, ఎస్సీ కాలనీ, యాతపేట గ్రామాలలో ఇష్టారాజ్యంగా గోతులు తవ్వేసి నాసిరకం పైపులైన్ల పనుల కారణంగా ఆ విద్యాసంస్థలకు చెందిన బస్సులే అందులో కూరుకుపోవడం తెలిసిందే. సూయజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం పేరుతో ఆర్ అండ్ బీ రహదారులు కూడా తవ్వేశారు. దీనిపై పంచాయతీ ప్రజల నుంచి గ్రామ సచివాలయానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందినా సిబ్బంది స్పందించలేదు. కనీసం చెరువులో వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధం నుంచి ఉపశమన చర్యలు కూడా తీసుకోలేదు. ఈ విద్యాసంస్థలు విడుదల చేస్తున్న వ్యర్థాల కారణంగా చెరువే కాకుండా గ్రామాలలోని వ్యక్తిగత, వ్యవసాయ బోర్లు సైతం కలుషితమయ్యాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తాళ్లవలస చెరువులోకి చేరిన దుర్వాసనతో కూడిన తెట్టు



పంచాయతీలో సేకరించిన చెత్తను చెరువు గర్భంలోనే కాలుస్తున్నారిలా..



చెరువులో కలుషిత నీరు వస్తున్న బోరు



చెరువును ఆనుకుని రాజుల తాళ్లవలస

భరించలేని దుర్గంధం

నిత్యం విద్యాసంస్థల నుంచి విడుదల అవుతున్న వ్యర్థాల కారణంగా తాగునీరు కలుషితం అవడమే కాకుండా బంగారమ్మ ఆలయానికి వచ్చే భక్తులు, శ్మశానవాటికలో అంత్యక్రియలకు వచ్చే బంధువుల ముక్కుపుటాలు అదిరిపోయేలా కంపును భరించలేకపోతున్నారు. వ్యర్థాలు ఎండకు ఎండి నీటిపై తెట్టుగా కడుతున్నాయి. దీని నుంచి వచ్చే దుర్గంధం కారణంగా ఈ చెరువును ఆనుకుని ఉండే ప్రజలు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఈ చెరువులో పెరుగుతున్న చేపలపై కూడా కాలుష్య ప్రభావం ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు పంచాయతీలో సేకరించిన చెత్తను పారిశుధ్య సిబ్బంది శ్మశానవాటిక, రక్షిత మంచినీటి పథకం వద్ద వేసి నడి ఎండలో తగలబెట్టి పంచాయతీకి పొగ పెడుతున్నారు.

చెరువులు, గెడ్డల ప్రక్షాళన జరగాలి



తాళ్లవలస పంచాయతీలోని చెరువుతో పాటు దీనికి అనుసంధానంగా ఉన్న గెడ్డలన్నీ ప్రక్షాళన చేయాలి. విద్యాసంస్థల నుంచి శుద్ధి చేసిన మురుగునీటినే వదిలేలా చూడాలి. చెరువు గర్భంలో ఉన్న రక్షిత తాగునీటి పథకం, యాతపేట రోడ్డులోని పంప్‌హౌస్ చుట్టూ వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయాలి.

– బొడ్డు నరసింగరావు, తగరపువలస

ప్రజారోగ్యానికి 'పొగ'



చెరువు గట్టును ఆనుకుని గ్రామదేవత బంగారమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ఇక్కడి పారిశుధ్య సిబ్బంది తగలబెట్టే చెత్త కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే శ్మశానవాటికకు వచ్చేవారు కూడా బాధ పడుతున్నారు. ముఖ్యంగా అంత్యక్రియలకు వీలుగా శ్మశానవాటికలో తుప్పలు తొలగించాలి.

– చింతగుంట శివ, తాళ్లవలస

ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు



చెరువు, దుర్గంధం, శ్మశానవాటిక, గెడ్డల ఆక్రమణలపై ఏడాది నుంచి ఇప్పటి వరకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం. అయినా సచివాలయ సిబ్బంది తప్పించుకుని తిరుగుతున్నారు. కనీసం స్పందించడం లేదు. ఇప్పటికైనా వారు బాధ్యతగా వ్యవహరించి, చర్యలు తీసుకోవాలి.

– చిల్ల సూర్యనారాయణరెడ్డి, వలందపేట

ఘనంగా త్రిశక్తి ఆలయ పుష్కర వార్షికోత్సవం



త్రిశక్తి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

మధురవాడ: కొమ్మాది జంక్షన్ త్రిశక్తి ఆలయంలో కొలువైన శ్రీ బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గ దండుమారమ్మ వార్ల ఆలయ పుష్కర వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచే మేలుకొలుపు, గణపతి పూజ, పంచగవ్యప్రాసన అనంతరం పంచామృత, సుగంధ, ఫలోదక, పవిత్ర నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. వేదపండితులు హోమం జరిపించారు. మధురవాడ ప్రాంత 14 గ్రామాల ఆరాధ్య దేవతల వార్షిక వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు పిల్లా పాపారావు, కోశాధికారి వాండ్రాసి అప్పలరాజు, పిల్లా సూరిబాబు దంపతులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైస్ కోసం కాల్ చేయండి

రేషన్ డిపో తెరవకుండా, స్టిక్కర్ అంటించిన డీలర్



మూసివేసిన రేషన్ డిపో వద్ద అంటించిన స్టిక్కర్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ఎస్సీ కాలనీ వద్ద 559 నంబర్ గల రేషన్ డిపో నిత్యం మూసి ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండావానలను సైతం లెక్కచేయకుండా రేషన్ కోసం దూర ప్రాంతాల నుంచి డిపోకు వస్తున్నామని, తీరా డిపో మూసి ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని కార్డుదారులు తెలిపారు. పైగా రైస్ కోసం కాల్ చేయమని స్టిక్కర్ అంటించారని తెలిపారు. వాస్తవానికి ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరలా సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ డిపో తప్పకుండా తెరిచి ఉంచాలి. కానీ, రేషన్ కావాలంటే ఫోన్ చేసి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు వచ్చేవని, ఇప్పుడు డిపోకు వెళ్తున్నా ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ప్రతి నెలా ఇదే మాదిరిగా ఇక్కడ డీలర్ ప్రవర్తిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిపో తెరచి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

సచివాలయానికి రప్పించి పింఛన్ల పంపిణీ



రుషికొండ సచివాలయానికి వచ్చి పెన్షన్ తీసుకుంటున్న వృద్ధులు



సచివాలయానికి ఆటోలో వచ్చిన వృద్ధురాలు

కొమ్మాది: పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించాలనేది ప్రభుత్వ నిబంధన. అయితే, ఆ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ (81) సచివాలయ సిబ్బంది. ఇక్కడి సచివాలయానికి వృద్ధులను రప్పించి పింఛన్ ఇవ్వడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడవలేని పరిస్థితిలో ఉన్న తాము ఆటో ఏర్పాటు చేసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికారులు స్పందించి, ఇంటివద్ద పింఛన్ పంపిణీ చేయాలని కోరుతున్నారు.

గంగ ఒడికి శివపుత్రుడు





భీమిలి తీరంలో నిమజ్జనాలకు తీసుకువెళ్తున్న విగ్రహాలు

భీమునిపట్నం: శివపుత్రుడు గంగ ఒడికి చేరుకుంటున్నాడు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భీమిలి తీరంలో గణనాథుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున విగ్రహాలను ఇక్కడి తీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. విగ్రహాల నిర్వాహకులు ఇసుకలో కొంతదూరం తీసుకువెళ్లగా, అక్కడి నుంచి గత ఈతగాళ్లు వాటిని నీటిలోకి తీసుకువెళ్లి కలుపుతున్నారు. నీటి వద్దకు ఎవరూ రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు, సీఐ తిరుమలరావు వారికి సూచనలు అందించారు.

తీరానికి తరలిన కార్యసిద్ధి వినాయకుడు

తగరపువలస: గణపతి పంచమరాత్రులు ముగిసిన సందర్భంగా సోమవారం పలు గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీలు నిమజ్జనానికి తరలించారు. భీమిలి సాగర సంగమ తీరంతో పాటు తగరపువలస గోస్తని నది పరీవాహక ప్రాంతాల్లో ఈ నిమజ్జనాలు సాయంత్రం నుంచి జరుగుతున్నాయి. మండపాల వద్ద లడ్డూ ప్రసాదం వేలం, లక్కీ డ్రా వంటివి నిర్వహిస్తున్నారు. బాణసంచా, నేలవేషాలతో ఆయా ప్రాంతాలు కోలాహలంగా ఉన్నాయి. ఆదర్శనగర్ టీచర్స్ కాలనీ వద్ద ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు తదితరులు కార్యసిద్ధి వినాయకుని నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలుతున్న కార్యసిద్ధి వినాయకుడు

పైసా వసూల్

స్మార్ట్ కార్డు పేరుతో డబ్బులు దండుతున్న టీడీపీ నాయకుడు

కొమ్మాది: రేషన్‌కార్డు స్థానంలో స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అయితే, జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో జరుగుతున్న స్మార్ట్‌కార్డుల పంపిణీలో ఇదే ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు డబ్బులు వసూలు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి స్మార్ట్ కార్డుకు రూ.30 ఇవ్వాల్సిందేనని నాయకుడు రుబాబు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. దీనిపై ఎవరైనా నిలదీస్తే వచ్చే నెల నుంచి మీకు రేషన్ ఉండదని బెదిరిస్తున్న సంఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన పి.వెంకటేశ్వరరావును పాఠశాలలో సోమవారం ఘనంగా సత్కరించారు. వెంకటేశ్వరరావు దంపతులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ దుశ్శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు దంపతులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, వెంకటాపురం సర్పంచ్ కె.రమణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆర్.జగదీష్‌బాబు, ఎ.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వానలోనే నిరీక్షణ



చినుకులలో నానుతూ బస్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని పీఎం పాలెం పరిసర ప్రాంతాలలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు బస్టాపుల వద్ద చినుకులలో నానుతూ బస్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. కారుషెడ్ కూడలి, పీఎం పాలెం ప్రధాన రహదారిలోని నాలుగు బస్టాపుల వద్ద ప్రయాణికులు తలదాచుకునేందుకు వీలుగా బస్ షెల్టర్లు లేనందున రద్దీ సమయాల్లో మరింత ఇబ్బంది పడుతున్నారు.

15 బెంచీల వితరణ

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆనందపురం మండలం వేములవలసకు చెందిన ఉషాదేవి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఎం.రామ్ జోగినాయుడు సోమవారం 15 బెంచీలు అందించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి విద్యార్థులు పాల్గొన్నారు.



దాత అందించిన బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

రైతులంతా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలి

తగరపువలస: ఖరీఫ్ సీజన్ సెప్టెంబరు చివరన పూర్తవుతున్నందున రైతులంతా వారు వేసిన వరి ఇతర పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ భీమిలి ఏడీ విజయప్రసాద్ ప్రకటనలో తెలిపారు. భీమిలి డివిజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 10,388 ఎకరాలు కాగా ఆగస్టు 31 నాటికి 8230 ఎకరాలలో ఉడుపులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆనందపురం మండలంలో సాధారణ విస్తీర్ణం 1529 ఎకరాలకు గాను 771, భీమిలిలో 1283 ఎకరాలకు గాను 750, పద్మనాభం మండలంలో 7576 ఎకరాలకు గాను 6709 ఎకరాలలో ఉడుపులు అయ్యాయని తెలిపారు. స్థానిక గ్రామ రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జి పొలానికి వచ్చి పంట ఫొటో తీసి ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో నమోదు చేసి మెసేజ్ పంపిస్తారన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు బీమా కవరేజీ వర్తిస్తుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందడానికి , ఎరువులు, వ్యవసాయ ఉపకరణాలు, పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం, మద్దతు ధర కల్పించడానికి అలాగే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా పెట్టుబడి సహాయం పొందడానికి ఈ క్రాప్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

జోన్-1 పీజీఆర్‌ఎస్‌కు ఐదు వినతులు



వినతులను స్వీకరిస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు ఐదు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు వినతులు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒక వినతి వచ్చాయి. వీటిని పరిశీలించి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.

కుక్కల బెడదపై కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్థానిక పెద్దలు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నీలాపు సూర్యనారాయణరెడ్డి తెలిపారు.


పేదల ఇళ్ల స్థలాలు కబ్జా చేసిన వారిపై ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం పంచాయతీ సర్వే నంబర్ 11లో పేద ప్రజలకు మంజూరు చేసిన 8 ఇళ్ల స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన మాజీ సర్పంచ్ అగరపు గంగరాజు, అతని కుమారుడు దేముడుబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2006లో అప్పటి ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఈ ఇళ్ల స్థలాలను తండ్రీకొడుకులు వారికి చెందకుండా కాజేశారని అక్కిరెడ్డి పెంటయ్య తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి, ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు ఇప్పించాలని కోరారు.

వినాయకాయ.. విభిన్న రూపాయ..



చిల్లపేటలో మహావీరుని రూపంలో కొలువైన గణపతి



బంగ్లామెట్టపై బహుముఖ గణపతి



చిననాగమయ్యపాలెంలో మహాబలునిగా

గౌరీ తనయుడు విభిన్న రూపాల్లో కొలువుదీరి, పూజలందుకుంటున్నారు. మహావీరుడిగా, బహుముఖుడిగా, మహా బలుడిగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఏకదంతుడైన బొజ్జ గణపయ్యను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పంచరాత్రులు పూర్తయిన సందర్భంగా నిర్వాహకులు కొన్ని మండపాల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్నారు.

– తగరపువలస

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com